సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని, నలుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



పోలీసు విధులను తెలియజేసేందుకే ఓపెన్ హౌస్

విద్యార్థులకు పోలీసు విధులను తెలియజేసేందుకే ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.400

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 307 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

రాయచోటి అర్బన్: ఈనెల 27వతేదీ ఆదివారం రాయచోటిలోని ఎన్‌జీఓ సభా భవనంలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కడప జిల్లా పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు పి.రెడ్డెయ్య తెలిపారు. కవులు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

30న కోడూరు, మదనపల్లెలో మినీ జాబ్ మేళాలు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ సీడీఎఫ్‌లు సంయుక్తంగా ఈనెల 30వ తేదీన మినీ జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎ.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మదనపల్లెలోని జీఎంఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో, రైల్వేకోడూరు అమ్మహాస్పిటల్ రోడ్డులోని గ్లోబల్ సర్వీస్ సంస్థలో మినీ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ముత్తూట్స్ ఫైనాన్స్ కంపెనీలో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకింగ్‌లో ఫీల్డ్ వర్క్ ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 8897776368 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థి



సుదర్శన్ నాయక్‌తో కోచ్ దేశ్‌ముఖ్

తంబళ్లపల్లె: ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న తంబళ్లపల్లెకు చెందిన సుదర్శన్ నాయక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలులో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో 1.72 మీటర్ల హైజంప్‌లో ప్రతిభ చాటి రెండవ స్థానం దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన ట్రిపుల్ జంప్ 12.45 మీటర్ల పోటీలో రెండో స్థానంలో నిలిచాడు. నవంబర్ నెలలో జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని కోచ్ దేశ్‌ముఖ్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ అల్తాఫ్ బాను, అధ్యాపకులు అభినందించారు.

రాయచోటి మున్సిపాలిటీకి రెండు అవార్డులు



మెప్మా సిబ్బందిని అభినందిస్తున్న రాయచోటి మున్సిపల్ కమిషనర్

రాయచోటి అర్బన్: వీధి విక్రయదారులకు రుణాలు ఇప్పించడం, కనీస వసతులు కల్పించడంలో మంచి ఫలితాలను సాధించినందుకు రాయచోటి మున్సిపాలిటీ అవార్డులు పొందింది. ఇందులో ఒకటి జాతీయ స్థాయి, మరొకటి రాష్ట్ర స్థాయి అవార్డు కావడం విశేషం. ఈమేరకు మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ నుంచి శనివారం రాయచోటి మున్సిపాలిటీకి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 29న విజయవాడలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాయచోటి మెప్మా అధికారులు, సిబ్బంది కృషితోనే రాయచోటి మున్సిపాలిటీకి అవార్డు దక్కిందన్నారు. ఆ మేరకు మెప్మా సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తన చాంబర్‌లో అభినందించారు.

వెలుగులకు చంద్ర గ్రహణం

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు 37 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వీటిలో జగనన్న కాలనీల్లో పేదలకు సౌకర్యం కోసం ప్రాధాన్యం
- రూ.60–70 కోట్ల వ్యయంతో 2023లోనే నిర్మాణ పనులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో 32 సబ్‌స్టేషన్ల రద్దు
- టెండర్లు, ఒప్పందాలు జరిగినా బేఖాతర్



తాటిగుంటపల్లెలో నిర్మాణంలోని 33/11 విద్యుత్ కేంద్రం

బి.కొత్తకోట: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులపై వివక్ష చూపుతోంది. అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన మెరుగైన సౌకర్యాలపై రాజకీయాలు ప్రేరేపితం అవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక అసమానతలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ఇప్పటికే మంజూరైన, ఒప్పందాలు జరిగిన పనులను రద్దు చేస్తూ ప్రజలను సౌకర్యాలకు దూరం చేస్తోంది. మెరుగైన విద్యుత్ సరఫరా, లోఓల్టేజీ నివారణ, నిరంతరం విద్యుత్, సరఫరా నష్టాలను తగ్గించడం, పేదలున్న కాలనీలకు విద్యుత్ వెలుగులు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు మంజూరు చేసిన వాటిలో 32 విద్యుత్ సబ్‌స్టేషన్లు వెనుకా ముందు ఆలోచించకుండా రద్దు చేసేసింది.

ఒకేసారి 37 సబ్‌స్టేషన్లు

ప్రజలకు, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉన్నతాధికారులకు పంపిన కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా రూ.60–70 కోట్ల వ్యయంతో 37 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. ఈ నిర్ణయంతో మారుమూల పల్లెలు, జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు వెదజల్లడానికి అన్ని చర్యలు పూర్తి చేసింది. నిధులు మంజూరైన తొలి విడతలో 14 విద్యుత్ కేంద్రాలు పనులకు సిద్ధమయ్యాయి. రెండో విడతలో మిగిలిన కేంద్రాలకు అనుమతులు రావడంతో టెండర్లు నిర్వహించి పనులు అప్పగించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తయింది.

సమస్యలకు పరిష్కారం

రెండు జిల్లాల్లో కొత్తగా మంజూరై నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలు పూర్తయితే వినియోగదారులకు సరఫరా సమస్య ఉండబోదు. విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమై, అంతరాయాలకు చెక్ పడుతుంది. విద్యుత్ లైన్లు అధిక దూరంలో ఉండటం వల్ల సరఫరా నష్టాలతో సంస్థకు ఆదాయ పరంగా నష్టాలొస్తాయి. సబ్‌స్టేషన్ల సమీపం నుంచి సరఫరా లైన్లు ఉండటం వల్ల సరఫరా నష్టాలను అధిగమించవచ్చు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, వైఫల్యం చెందడం తగ్గుతుంది. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించాయే సబ్‌స్టేషన్లతో కాలనీలకు నిరంతరం విద్యుత్ సరఫరాతో ఇబ్బంది కలగకుండా సేవలు అందుతాయి.

ప్రభుత్వం వద్దనుకుంది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మారుమూల పల్లెలకు మంజూరు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు అవసరం లేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పనులు పూర్తి చేసేందుకు గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత ఎన్నికలు, కొత్త ప్రభుత్వం కొలువు కావడంతో పరిస్థితులు మారిపోయాయి. 37 సబ్‌స్టేషన్లలో పనులు జరిగిన ఐదింటిని మినహాయించి మిగిలిన వాటికి పనులు చేపట్టడం అవసరం లేదని తేల్చేసి రద్దు చేయడంతో పనులు మొదలు కాకుండానే ఆగిపోయాయి. కాగా ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల నుంచి ఉన్నతాధికారులు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం అయిష్టత వ్యక్తం చేయడంతో పనులు చేసే అవకాశం లేకపోయింది.

ఆ ఐదు చోట్ల పనులు: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన చక్రాయపేట మండలం సుంకేసుల, సింహాద్రిపురం మండలం ఉక్కిసవాండ్లపల్లె, రామాపురం మండలంలోని చీమలచెరువుపల్లె, తాడిగుంటపల్లె, బోయపల్లెల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటిదాకా జరిగిన పనుల్లో సాంకేతికపరమైన పనులు మినహా మిగతా పనులు పూర్తి కావడంతో సాంకేతిక పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించారు. కాంట్రాక్టర్లు పనులు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉండగా డిస్కం అధికారులు నోటీసులు జారీ చేసి పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఔను.. రద్దయ్యాయి

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు గత ప్రభుత్వం మంజూరు చేసిన 33/11 విద్యుత్ కేంద్రాలు రద్దయ్యాయని ఈ జిల్లాలకు చెందిన డిస్కం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఐదుచోట్ల పనులు జరగడంతో వాటిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అందిన సూచన మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. మంజూరై రద్దయిన సబ్ స్టేషన్ల విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన సూచనలు అందలేదని పేర్కొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో రద్దయినవి
పులివెందుల జగనన్న కాలనీ
కడప మామిళ్లపల్లె,
నానాపల్లె,
మైదుకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ
కుడాలి
కమ్మవారిపల్లె
ప్రొద్దుటూరు మీనాపురం
పులివెందుల చిలేకాంపల్లి
ఉడవగండ్ల
లోపట్నూతల
రాంనూతనపల్లె
వలిమెల్ల
రామేశ్వరం జగనన్న కాలనీ
బొల్లవరం జగనన్న కాలనీ
పైడిపాలెం
కొత్తగంగిరెడ్డిగారిపల్లె
గొందిపల్లె

అన్నమయ్య జిల్లాలో..
రెడ్డివారిపల్లె
బాలపల్లె
గొబ్బూరువారిపల్లె
నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ
అరవీడు
రామాపురం
పాతకోట
పులికల్లు
మద్దినాయునిపల్లె
బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీ
దిన్నిమీదపల్లె
దండువారిపల్లె
మట్లివారిపల్లె
బాలయ్యగారిపల్లె
సరిమడుగు

చేపల పెంపకంపై రేపు వేలం పాట



అధికారుల సంతకాలు లేకుండా నోటీస్ బోర్డులో అంటించిన వేలం పాటల ప్రతి

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం చెరువులో చేపల పెంపకం కోసం గతంలో వేలంను దక్కించుకున్న నిర్వాహకులే ఈ సారి కూడా అధికారులతో రహస్యంగా రెన్యువల్ చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయనే విషయం దావానలంలా పాకింది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న సాక్షి పత్రికలో ప్రచురితమైన 'చేపల' కోసం అధికారులకు 'గాలం' వార్తపై అధికారులు స్పందించారు. ఈ నెల 28న రాపూరివాండ్లపల్లి గ్రామ సచివాలయం ఎదుట వేలం పాటలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. బహిరంగ వేలానికి వారం రోజుల ముందు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో వేలం పాటల ప్రతులను అంటించి సదరు కార్యాలయం అధికారి వద్ద సంతకం తీసుకోవాలి. గ్రామాల్లో ముందస్తుగా చాటింపు వేయాలి. గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రభుత్వ నిబంధనలకు తుంగలో తొక్కి వేలం పాటలను ఒక రోజు ముందుగా ప్రకటించడం, అది కూడా ఆదివారం కావడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ముందస్తుగా డిపాజిట్ సొమ్ము ఎప్పుడు చెల్లించాలి, ఆదివారం సెలవు రోజులో కూడా పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండి డిపాజిట్ సొమ్మును స్వీకరించి రసీదులు ఇస్తారా, లేకుంటే వేలం పాట జరిగే రోజు కూడా నగదు తీసుకుంటారా అనే అనుమానాలు నివృత్తి కావాలంటే సోమవారం వరకూ వేచి చూడాల్సిందే. వేలానికి సంబంధించి అధికారులు సర్క్యులర్ తయారుచేసి అందులో ఎవరి సంతకం లేకుండానే 26న నోటీస్ బోర్డులో అంటించడం గమనార్హం.

సాగు చేస్తే చంధనమే!

- సంద్రడివిలో ఎర్రచందనం సాగు సక్సెస్
- ఫలించిన అటవీ శాఖ ప్రయోగం



సంద్రడివిలో ఏపుగా పెరుగుతున్న ఎర్రచందనం చెట్లు

ములకలచెరువు: శేషాచలం అటవీ ప్రాంతంలో విస్తారంగా పెరిగే ఎర్రచందనం చెట్లు ఈ ప్రాంతంలో కూడా మూలాలు వేస్తున్నాయి. దేశంలోనే ఎర్రచందనం చెట్లు శేషాచలం అటవీ ప్రాంతానికి కేరాఫ్‌గా మారాయి. స్మగ్లర్ల దోపిడీతో శేషాచలం అడవిలోని నాణ్యమైన ఎర్రచందనం క్రమంగా అంతరించిపోతోంది. దీంతో ఎర్రచందనం పెంపకానికి అనుకూలమైన ప్రాంతాలు, నేలలను గుర్తించడానికి అటవీ శాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఈ ప్రాతంలో ఎర్రచందనం చెట్లు పెరుగుతాయని భావించి చేసిన ప్రయోగం ఫలించింది. ములకలచెరువు మండలం వేపూరికోట, మద్దినాయునిపల్లె పంచాయతీలోని సంద్రడివి ప్రాతంలో ఎర్రచందనం చెట్లు పెరుగుతున్నాయి. కరువు ప్రాంతమైన ములకలచెరువు మండలంలో కూడా పెరుగుతున్న ఎర్రచందనం చెట్లు చూస్తుంటే ఈ ప్రాంతం వందశాతం అనువుగా ఉన్నట్లు తేలింది.

నాటిన అన్ని మొక్కలు బతికాయ్

ములకలచెరువు మండలం సంద్రడివిలో 2015 సంవత్సరంలో 6 వేల ఎర్రచందనం మొక్కలు అటవీ శాఖ అధికారులు నాటించారు. ఈ మొక్కల సంరక్షణకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా వేసవిలో ట్యాంకర్లతో నీటిని అందించారు. అవసరమైన సేంద్రియ ఎరువులను వేశారు. అధికారులు ఆశించిన విధంగా ప్రతి మొక్క బతికింది. మొక్కలు ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. ఎర్రచందనం నాటిన చోట్ల చిన్న కందకాలు తవ్వారు. ఈ కందకాల్లో వర్షపు నీరు నిలిచి చాలా రోజుల వరకు చెట్లకు నీరందుతుంది.

ఔషధ మొక్కల పెంపకం విజయవంతం



పెద్ద వృక్షాలుగా పెరిగిన నీలగిరి చెట్లు

సంద్రడివిలో ఔషధ మొక్కల పెంపకం కూడా విజయవంతమైంది. 2015లో ఎర్రచందనంతో పాటు ఔషధ మొక్కల పెంపకం ప్రారంభించారు. కలబంద, అడివిగంధి, ఉసిరి, శ్రీగంధం, వేప, అల్లనేరేడు, ఎలగ, తపసి, కుంకుడు మొక్కలు కూడా ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. అలాగే 20 ఏళ్ల క్రితం నాటిన నీలగిరి చెట్లు భారీ వృక్షాలుగా మారాయి. సుమారు 500కు పైగా ఎకరాల్లో నాటిన నీలగిరి మొక్కలు కూడా వంద శాతం బతికాయి.

కంటికి రెప్పలా కాపాడుకున్నాం

సంద్రడివిలో నాటిన ఎర్రచందనం మొక్కలను కంటికి రెప్పలాగా కాపాడుకున్నాము. మొదట మూడేళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పట్టాము. ప్రస్తుతం చెట్లయ్యాయి. ఇక వర్షాధారంగా చెట్లు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎస్. షబీస్‌తాజ్, అటవీశాఖ సెక్షన్ అధికారి, బురకాయకోట

నేడు హైదరాబాద్‌కు విమాన సర్వీసు ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నుంచి హైదరాబాదుకు ఆదివారం విమాన సర్వీసును ప్రారంభించనున్నట్లు కడప విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రయాణికులు నూతన సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన డీఈఓ



డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి: జిల్లా విద్యాశాఖాధికారిగా సుబ్రమణ్యం శనివారం రాయచోటిలోని డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సుబ్రమణ్యంను పదోన్నతిపై జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గుణాత్మక విద్యా సాధన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోవు పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో అన్నమయ్య జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెస్తామన్నారు. ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటిస్తూ గ్రామీణ, పట్టణ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా పని చేయాలని సూచించారు.

బస్సుల దారి మళ్లింపునకు బ్రేక్

సాక్షి ఎఫెక్ట్..



రాజంపేట పట్టణ ప్రధాన రహదారిలో వెళుతున్న ఆర్టీసీ బస్సు

రాజంపేట: రాజంపేట బైపాస్‌లో బస్సుల దారి మళ్లింపునకు శనివారం బ్రేక్ పడింది. దారి మళ్లింపు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో నారూటే బైపాస్ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆర్టీసీ బస్సులు యధావిధిగా పాత బస్టాండ్‌కు పట్టణ రహదారుల్లో వెళ్లేలా అనుమతించారు. దీంతో ప్రజలు సాక్షి పత్రికకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ బస్సులు ఇప్పుడు పట్టణ రహదారి గుండా రాజంపేట పాత బస్టాండుకు చేరుకుంటున్నాయని వివరించారు. పోలీసు శాఖ ఆదేశాలతో మళ్లీ ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

మదనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని నక్కల దిన్నెలో కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. స్థానికంగా మద్యం విక్రయిస్తున్న శంకర్‌నాయక్(35)ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఇంట్లో ఉంచిన 52 సిల్వర్‌కప్(90ఎం.ఎల్) కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రామం ముత్తుమారమ్మ ఆలయంలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేస్తూ భక్తులను భయభ్రాంతాలకు గురి చేశాడు. ఈ సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని రైల్వే ఆర్‌పీఎఫ్‌లకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవరాలికి గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో తాతా, మనువరాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. మదనపల్లె పట్టణం మంజునాథకాలనీకి చెందిన నరసింహులు(60), తన మనవరావు జాహ్నవి(19)ని ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకొస్తుండగా బైపాస్‌రోడ్డులో చంద్రకాలనీ వద్దద ఐచర్ వాహనం ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన వై.వెంకట మహేశ్వరరెడ్డిపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ శనివారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్



ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఆయుధాల పనితీరును వివరిస్తున్న పోలీసు సిబ్బంది

రాయచోటి : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా పోలీసు విధులను తెలియజేసేందుకే ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, టెక్నాలజీ, డాగ్స్ స్క్వాడ్ పట్ల ప్రజలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. శనివారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాయచోటిలోని పోలీసు పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. విధి నిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణార్థం రోజున ఓపెన్ హైస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల ఛేధనలో పోలీసులు ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్, స్పీడ్ గన్, ఇతర పరికరాలు, నేర పరిశోధన, బాంబ్‌లను గుర్తించడంలో పోలీసు డాగ్స్ పనితీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలు గురించి విద్యార్థులకు వివరించి, విద్యార్థుల్లో పోలీసు శాఖ పట్ల ఆసక్తిని ఎస్పీ కలిగించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా గట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మమేకమై ఆప్యాయంగా మాట్లాడారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాదనాలను ప్రదర్శనలో ఉంచారు. సందర్శనకు వచ్చిన వారికి ఆయుధాల గురించి సిబ్బంది అవగాహన కల్పించారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమాలు

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేశారు.

28న రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని 28వ తేదీన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సోమవారం ఉదయం రాయచోటిలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. శిబిరంలో జిల్లా పోలీసులు, మహిళా పోలీసులు స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నికష్ణ, ఎస్బీ సీఐలు టివి సత్యనారాయణ, శంకరయ్య, చలపతి, పట్టణ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ వరప్రసాద్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

8 మందికి రూ.10,500ల చొప్పున జరిమానా

రాయచోటి టౌన్ : పట్టణంలో వివిధ ప్రాంతాలలో డ్రంక్ డ్రైవ్ కేసు నిందితులు నలుగురికి ఒక్కొరికి నెల రోజుల జైలు శిక్ష, మరో ఎనిమిది నిందితులకు ఒకొక్కరికి రూ.10,500 జరిమానాను రాయచోటి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆసీఫా సుల్తానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం కోర్టు ముందు హాజరు పెట్టగా ఈ శిక్షలు అమలు చేసినట్లు తెలిపారు. రెండు రోజులుగా రాయచోటి పట్టణ, శివార్లలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలిందని చెప్పారు. మద్యం తాగి వాహనలు నడిపిన వారిలో షేక్. ఆరీఫ్, దాసరి వినోద్, షరీఫ్, సయ్యద్ చాన్‌బాషలకు కోర్టు మెజిస్ట్రేట్ ఒకొక్కరికి నెల రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే షేక్. రహంతుల్లా, దేరంగుల వెంకట శివ, దుర్గం నాగశ్వర్, జూలపల్లె రహంతుల్లా, ఎద్దులపల్లె రెడ్డికుమార్, గోగుల వాసుదేవ, షేక్ .మౌలానా, దేరంగుల నాగేంద్రలకు ఒక్కొక్కరికి రూ.10,500లు జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యంగా తాగి వాహనాలు నడపరాదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు మంత్రి రాక

రాయచోటి టౌన్ : క్రీడలు, యువజన, రవాణశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆదివారం రాయచోటికి రానున్నట్లు మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి వైఎస్సార్ జిల్లాకు 12-40 చేరుకొని అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లాలోనే ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో నిర్వహించే ప్రైవేట్ ఎయిడేడ్ పాఠశాలల అసోషియేషన్ వారు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి 2-30 గంటలకు రాయచోటికి చేరుకొని రాయచోటి పట్టణంలో అబ్జల్ కల్యాణ మండపంలో వివాహ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. 3 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఎనిమిది బస్సుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 3-330 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడల పోటీల నిర్వహణలో పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు సంబేపల్లె మండలం రౌతుకుంటలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ కబడ్డీ ఆటల పోటీలు

రాయచోటి టౌన్: జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్ -17 కబడ్డీ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి యం. వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ ఆటల పోటీలు 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఆటల పోటలు రాష్ట్ర క్రీడల, యువజన, రవాణ శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో సీఐ రామాంజనేయులు

రాజంపేట : మండలంలోని పోలిసీతారామపురం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, సుబ్బరాయుడులపై హత్యాయత్నం చేసిన కేసులో సుండుపల్లె మండలం చెరుకు వాండ్లపల్లె గ్రామానికి చెందిన గూడూరు నాగరాజును అరెస్టు చేశామని మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత జనవరిలో భార్య, అమ్మ, నాన్నలను కూడా నాగరాజు కత్తితో పొడిచి పాల్పడ్డాడు అని తెలిపారు. గత కొన్నేళ్ళుగా తప్పించుకొని తిరుగుతున్న గూడూరు నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండుకు ఆదేశించారన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ

మదనపల్లె: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.మూడు లక్షల విలువైన బంగారం చోరీ చేసిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కోళ్లబైలుపంచాయతీ బయ్యారెడ్డి కాలనీకి చెందిన నాగేంద్ర బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సంవత్సరం క్రితం వివాహం కావడంతో ఇంటి వద్దనే వర్క్‌హోం విధులు నిర్వహిస్తున్నాడు.శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలో నివాసం ఉన్న నాగేంద్ర అక్క ఇంటికి భోజనం వెళ్లాడు. శనివారం ఉదయం తిరిగి వచ్చిన నాగేంద్ర ఇంటి తాళం కప్ప ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. ఇంట్లోన్న రూ.3లక్షలు విలువ చేసే 60 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు నిర్ధారించి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని సీఐ కళావెంకటరమణ పరిశీలించారు.

బాలలను సంరక్షించుకోవడం బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా బాలలసంరక్షణ అధికారి రామలక్ష్మి

రైల్వేకోడూరు అర్బన్ : బాల బాలికలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని శనివారం జిల్లా బాలలసంరక్షణ అధికారి రామలక్ష్మి తెలిపారు. స్థానిక సిల్వర్‌బెల్స్ హైస్కూల్‌లో బాలల సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో బాలికలను చదివించుకొని వారిని రక్షించుకొందామని తెలిపారు. అలాగే దిశా చట్టం, చైల్డ్‌ట్రాఫికింగ్, జువైనెస్‌జస్టిస్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మస్తాన్‌సాహెబ్, రవీంద్రనాద్, విజయలక్ష్మి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు భయపడవద్దు.. అండగా ఉంటాం



ఫీల్డ్ అసిస్టెంట్ సుగుణను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్డీఏ కూటమి నాయకుల ఒత్తిళ్లకు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు భయపడవద్దు.. అందరికీ అండగా ఉంటామని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోలు మణి అన్నారు. మండలంలోని బుడుగుంటపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సుగుణ ఒత్తిళ్లకు తట్టుకోలేక ఆస్పత్రి పాలవడంతో ఆమెను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారుల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని తెలిపారు. మాట వినకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదేమాదిరి ఒత్తిడికి గురై ఏపీఎం రవికుమార్ మృతి చెందినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజశేఖర్, వెంకటరమణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



అటవీశాఖ అధికారుల అదుపులో నిందితులు, దుంగలు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి పంచాయతీ, బోడివాండ్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని, నలుగురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి బాలిరెడ్డి సూచనలతో సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు ఆర్ఎస్ఐ పి నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ సిబ్బందితో కలిసి సానిపాయి-రాయచోటి రోడ్డులోని తనిఖీ నిర్వహించారు. బొల్లువాండ్లపల్లి రోడ్డువద్ద కొందరు వ్యక్తులు కనిపించి పోలీసులను చూసి పారిపోతుండగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు తమిళనాడు రాష్ట్రం, కళ్లకురిచ్చి, సేలం జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. వీరి నుంచి రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రికి చెందిన ముత్తుముల జయరామిరెడ్డికి చెందిన గేదె శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. జయరామిరెడ్డి ఉదయాన్నే గేదెలను మేతకు తోలుకు వెళుతుండగా గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ప్రమాదంతో అక్కడిక్కడే మృతి చెందింది. రూ.60 వేల విలువ చేసే గేదె మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుడి కూల్చివేత కేసులో ఇద్దరు అరెస్ట్



ఆలయ ధ్వంసం కేసులో నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీప్రాంతంలోని అభయహస్త ఆంజనేయస్వామి ఆలయం కూల్చివేతకు జిలెటిన్‌స్టిక్స్ సరఫరా చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో నిందితుల అరెస్ట్‌కు సంబంధించి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ.. ఈనెల 14న ములకలచెరువు అభయాంజనేయస్వామి ఆలయాన్ని కూల్చివేసేందుకు కుట్రచేసిన ఆరుగురిని అరెస్ట్‌చేసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సమక్షంలో వివరాలు వెల్లడించామన్నారు. ఈ కేసులో గుడి కూల్చివేతకు, శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం టి.సదుంకు చెందిన వెంకటనారాయణ(27), షేక్ ఈదుల్లా(34)లు తమ ప్రాంతంలో నిలిచిపోయిన క్వారీ నుంచి నాలుగు జిలెటిన్‌స్టిక్స్ తీసుకువచ్చి, వాటిలో రెండింటిని ములకలచెరువు అభయాంజనేయస్వామి ఆలయ కూల్చివేతకు ఉపయోగించారన్నారు. ఆలయ ధర్మకర్త విద్యాసాగర్‌కు, పూజారి హరినాథ్‌కు దేవాలయంలోని పూజలపై విభేదాలు ఉన్నాయన్నారు. పూజారి హరినాథ్‌యాదవ్ గుడిని తన ఆధీనంలోకి తీసుకుని, ఆదాయాన్ని తానే పొందాలన్న కోరికతో ధర్మకర్త విద్యాసాగర్‌తో గొడవపడేవాడు. గుడి కింద గుప్తనిధులు ఉన్నాయని నమ్మించి జిలెటిన్ స్టిక్స్ సహాయంతో ఆలయాన్ని ధ్వంసం చేయించాడు. ఈ కేసులో ఐదుగురు నిందితులను ఇదివరకే అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్నటువంటి సత్యనారాయణ, ఈదుల్లాలను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కదిరి-మదనపల్లెరోడ్డులోని కొక్కంటిక్రాస్, తంబళ్లపల్లె క్రాస్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలి

- నవంబర్ 4న సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నర్సింహులు



మాట్లాడుతున్న పీఎల్.నర్సింహులు

మదనపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు విధులు కేటాయించకుండా, వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నర్సింహులు తెలిపారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వలంటీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కూటమిప్రభుత్వం ఏర్పడి ఐదునెలలు అవుతున్నా వలంటీర్లకు విధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికే అనేకమంది వలంటీర్లు రాజీనామాలు చేశారని, తక్షణమే వలంటీర్లకు విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గౌరవవేతనం రూ.10వేలు చెల్లించాలని కోరారు. వలంటీర్ల ఆందోళనకు సీపీఐ మద్దతు ఉంటుందని తెలిపారు. వలంటీర్ల సమస్యలపై నవంబర్4న మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీంబాషా, పట్టణకార్యదర్శి తిరుమల, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్, వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు ఫయాజ్, వెంకటశివ, వెంకటాచలపతి, శ్రీనివాసులు, పవన్‌కుమార్, వెంకటరెడ్డి, గౌతమి, సుధారాణి, స్వాతి, జయలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్టును సందర్శించిన ఎస్ఈ



పింఛా ప్రాజెక్టును సందర్శిస్తున్న జల వనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసులు

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టును జల వనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసులు శనివారం సందర్శించారు. గత వారంలో కురిసిన తుపానుకు డ్యామ్‌లోకి వర్షం నీరు రావడంతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. 2021 నవంబర్ నెలలో భారీ వరదలు కారణంగా తెగిపోయిన పింఛా డ్యామ్‌కు గత ప్రభుత్వం మరమ్మతులు చేయించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్యామ్‌లోకి వరదనీరు వచ్చింది. ప్రస్తుతం 164 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లో ఉండగా రైతులు వ్యవసాయానికి కుడి కాలువలో 40 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువలో 30 క్యూసెక్కుల నీటిని ఎస్ఈ శ్రీనివాసులు విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఈ చెంగల్ రాయుడు, ఏఈ నాగేంద్ర నాయక్, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పునఃప్రారంభించాలి

ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈనెల 28 నుంచి 30వ తేదీవరకు తహసీల్దార్ కార్యాలయం, నవంబరు 6న కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఇచ్చిన మధ్యాహ్న భోజనం పునరుద్ధరణ హామీని వెంటనే అమలు చేయాలన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ. 2100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ. 1400 కోట్ల వసతిదీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి పైపథకాల డబ్బులు విద్యాసంస్థలకు విడుదల కాకపోవడంతో వారు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధింపుకు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు. ఆందోళన కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నేతలు గురునాథ్, సతీష్, సాయి, సన్నీ, పవన్‌కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను దూషించిన కోచ్

రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు

వాల్మీకిపురం : అండర్- 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా, వాల్మీకిపురంకు చెందిన లలిత్ కుమార్, గిరిధర్, అరవింద్‌లు రెండు రోజుల క్రితం చిత్తూరులో శిక్షణ పొందిన అనంతరం శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరి వెళ్తున్నారు. మార్గమధ్యంలో వాల్మీకిపురంకు చెందిన కోచ్ నాగరాజు క్రీడాకారులను రైలు ఎక్కిన సమయం నుంచి దుర్భాషలాడటం మొదలు పెట్టి, పిల్లల ఎదుట తల్లిదండ్రులను కూడా దర్భాషలాడుతున్నాడు. కారణం తెలియకపోవడంతో క్రీడాకారులు విచారం వ్యక్తం చెయ్యడం, అంతే కాక వాల్మీకిపురం క్రీడాకారులకు ట్రైన్‌లో రిజర్వేషన్ లేకపోవడంతో టీసీ చెకింగ్ వచ్చిన సమయాన ఇబ్బందులు, టీసీ జరిమానా విధించేలోపే కోచ్ నానా మాటలు అనడంతో ముగ్గురు క్రీడాకారులు ఒకొక్కరిగా రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగిపోయారు. అక్కడి నుంచి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో క్రీడాకారుల తల్లిదండ్రులు వెళ్లి తమ పిల్లలను వాల్మీకిపురంకు తీసుకొని వచ్చారు. శనివారం ఈ విషయంపై పీటీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్స్‌పెక్టర్ భానుమూర్తిరాజుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. క్రీడల్లో తమ పిల్లల భవిష్యత్తుతో కోచ్ ఆటలాడుతున్నాడని, సంబంధిత కోచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

రగ్బీ జిల్లాజట్టు ఎంపికలకు స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ అనంత కృష్ణ

నందలూరు : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన రగ్బీ జిల్లా జట్టు ఎంపికలకు అనూహ్య స్పందన లభించినట్లు ఎంఈఓ-2 అనంత కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హైమావతి మాట్లాడుతూ ఉభయ జిల్లాల నుంచి అండర్-14, అండర్-17 రగ్బీ క్రీడా ఎంపికలలో బాల బాలికలు సుమారు 120 మంది క్రీడాకారులు (బాల, బాలికలు) పాల్గొన్నారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు అండర్ 14 బాలురు 12 మంది, అండర్-14 బాలికలు 12 మంది, అండర్-17 బాలురు 12 మంది, అండర్-17 బాలికలు 12 మంది మొత్తం 48 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రగ్బీ ఆర్గనైజర్స్ పొలంకి గణేష్ బాబు, కడప జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం ప్రవీణ్ కిరణ్, ఎన్జీఎఫ్ సెక్రటరీ బి అరుణ కుమారి, ఫిజికల్ డైరెక్టర్లు రాయుడు, షాహిన్, సుబ్రమణ్యం, రమేష్, ఓబయ్య, గురుకులం పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.